"మీ ఆవిడ తెలివైంది" మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

"నిజం. ఒక్క ఆదివారం తప్ప మిగతారోజుల్లో ఆవిడ అనుమతి లేకుండా తాగకూడదని మామధ్య ఒప్పందం వుంది."

మర్నాడు వుదయం నిద్రలేచాక బయటకి వస్తే ఆవిడ కనబడి నవ్వి నాతో చెప్పింది.

"నిన్న జరిగింది మీకు తెలిసిందటగా?"

తలవూపి నవ్వాను.

"ఆయనకి తెలియనిది, మీకు మాత్రం తెలిసే ఓ రహస్యంచెప్పనా? రిఫండ్స్ కౌంటర్‌లోని క్లర్క్‌కి అయిదు రూపాయలు లంచం ఇచ్చి, డబ్బు తిరిగి ఇవ్వటం ఆలస్యం చేయమని కోరాను. లేకపోతే ఎందుకండి ఆయన అనవసరంగా ఆరోగ్యం పాడుచేసకోవడం? టిక్కెట్ కేన్సిలేషన్‌కి అయిదారు రూపాయలు ఖర్చయినా నే చేసింది మంచి పని కాదంటారా?" ప్రశ్నించింది.

# భయంకరమైన రోజు

రెండు రోజులనుంచి వెదుకుతూంది అనూరాధ తన బాంక్ పాస్ బుక్ కోసం. తన టేబుల్‌లోని డ్రాయర్లన్నీ వెదికింది. ఇనుప బీరువా మొత్తం వెదికింది. తను రిఫరెన్సుకోసం కొన్ని పుస్తకాల రేక్‌లో వెదికింది. డ్రాయింగ్ హాలులో వెదికింది. డైనింగు హాలులో వెదికింది. వంట గదిలోనేకాదు, చివరికి బాత్‌రూమ్‌లో కూడా వెదికింది.

బాంక్ పాస్‌బుక్ ఆవిడకు కనబడలేదు. బాంకులోనుంచి డబ్బు తీయడానికి కాదు దానికోసం వెదికేది చెక్ సౌకర్యం వుండడవల్ల పాస్ బుక్కు లేకపోయినా ఫర్వాలేదు.

ముఖ్యమయిన విషయాలు ఆ పాస్ బుక్కులోనే చివరి పేజీలో రాసుకుంది ఆవిడ. ఎల్. ఐ. సి. పాలసీ నంబరు, బాంకు లాకర్స్ నంబరు, తన ఇన్‌కంటాక్స్ నెంబరు.... ఇలా ఆర్థిక సంబంధమయిన వివిధ విషయాలు ఆ పాస్ బుక్కులో చివరి పేజీలో రాసుకుంది.

అనూరాధ మలేషియాలో జరిగిన తెలుగు మహాసభలకు వెళ్ళినపుడు కౌలాలంపూర్‌లో ఒక బ్రీఫ్‌కేస్ కొంది. ఆ విదేశీ బ్రీఫ్‌కేస్‌కి తాళంచెవి అంటూ ప్రత్యేకంగా ఉండదు. నంబర్లు వుంటాయి. ముందే నిర్ణయించుకున్న మూడు నెంబర్లను తిప్పితే అది తెరుచుకుంటుంది. దానికి తాళము వేయాలనుకుంటే ఆ మూడు నెంబర్లని మార్చేస్తే తాళము పడిపోతుంది.

ఆ బ్రీఫ్‌కేస్‌లో క్రొత్తగా కొన్న పట్టు చీర, నగలు దాచి దాన్ని బీరువాలో దాచింది అనూరాధ. ఎవరయినా సాహితీ సభలకు పిలిచినప్పుడు వాటిని వేసుకుని వెళ్తుంది.

ఫిబ్రవరి నాలుగో తారీఖు సాయంత్రం ఆవిడ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో (ఎన్నడూ ఆవిడ రాయకపోయినా) డిటెక్టివ్ సాహిత్యం గురించి ప్రసంగించాలి. ఫిబ్రవరి ఒకటో తారీకునుంచి ఆవిడ బాంకుపాస్‌బుక్‌కోసం వెదుకుతూంది. మూడో తారీకు అయినా అది ఆవిడ కంట పడలేదు. దాన్ని తెరిచే నంబర్‌ని అడుగుదామంటే తన భర్త వూళ్ళో లేడు. ఆఫీసు కేంప్ మీద ఎర్నాకుళం వెళ్ళాడు.

“ఆ నంబరు తేలిగ్గా గుర్తుంచుకోవాలని మీ నాన్నగారు ఆయన జీవితంలో ఒక భయంకర సంఘటన జరిగిన తారీఖు, నెల ఉపయోగించి మూడు నంబర్లు ఎన్నుకున్నానని చెప్పినట్లు గుర్తు కాస్త కనుక్కోండిరా” కూతుళ్ళిద్దరితో, కొడుకుతో చెప్పిందావిడ ఫిబ్రవరి మూడో తారీఖు.

బ్రీఫ్‌కేస్ దగ్గర పెట్టుకుని తండ్రి జీవితంలోని భయంకర సంఘటనలు జరిగిన రోజులన్నీ ప్రయత్నించ సాగారు ముగ్గురు పిల్లలు.

తండ్రి ఎస్. ఎ తప్పిన రోజు, తప్పావన్న బాధతో రైలుపట్టాల దాకా వెళ్ళి తిరిగొచ్చిన రోజు, పరమ పాతక నికృష్ట హీనజనుడైన

ఆఫీసర్ బదిలీ అయి వచ్చిన రోజు, యాక్సిడెంటయి కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయిన రోజు, ఆయన స్కూటర్ దొంగలెత్తుకు పోయిన రోజు, ఆయన తల్లి మరణించిన రోజు, ఒక కోర్టు కేసులో వోడిపోయిన రోజు.... దాదాపు పాతిక నంబర్లు ప్రయత్నించారు కాని బ్రీఫ్‌కేస్ తెరుచుకో లేదు

"లాభం లేదమ్మా. నాన్నగారినే అడుగు."

ఆవిడ ఎర్నాకుళానికి ట్రంకాల్ చేసింది. నాలుగో తారీఖు ఉదయం గంటన్నర తర్వాత వచ్చింది కాల్. ఆయన లైన్‌లోకి వచ్చాక కంగారుగా అడిగారు.

"ఏమిటి? ఏమైంది?"

"ఏం లేదు. మన ఎకోరేక్ తెరచే నంబర్ మరచిపోయాను."

"పాస్ బుక్‌లో రాసుకున్నావుగా?"

"అది కనబడలేదు. ఆ నంబరేమిటో మీకు గుర్తుందా?"

"ఉంది"

"చెప్పండయితే."

"ఎలా మరచిపోగలను? రెండు, అయిదు, ఏడు."

"అంటే జూలై ఇరవై అయిదా?" కొద్దిక్షణాలు ఆలోచించి అడిగింది.

"అవును."

"అవును." "అన్నట్టు అది మన పెళ్ళిరోజు!!!"

అవతలవైపు అనురాధ మొగుడు లైన్ కట్ చేశాడు.

## రెండో తప్పు

సోమనాధ్ జీవితంలో చేసిన ఏకైక తప్పు తన ఏభై రెండవ ఏట శ్యామలని పెళ్ళి చేసుకోవటం. ఆమె వయస్సు ఇరవై రెండు. ఒకానొక